డ్రైయిన్ల తంతు.. తూతూమంత్రం..

పూడికతీత పనుల్లో నిర్లక్ష్యం

- రూ.4.78 కోట్లతో పనులు
- వర్షం కాలం వచ్చినా పూర్తికాని వైనం
- పైపైన చేసుకుంటూ వెళ్లిపోతున్న కాంట్రాక్టర్లు
- వర్షం పడితే లోతట్టు ప్రాంతాలు జలమయం


నగర శివారులో పొక్లెయిన్‌తో డ్రైయిన్ శుభ్రం చేస్తున్న దృశ్యం


ఓల్డ్ క్లబ్ రోడ్డు ఆస్పత్రుల ముందు తీసిన సిల్ట్‌ను వదిలేసిన దృశ్యం

నెహ్రూనగర్: వర్షాకాలం వచ్చేసింది.. నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. దీంతో ముంపునకు గురైన ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటారు. ఈ సమస్యకు పరిష్కారం కోసం ప్రతి ఏడాది మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ముందుగానే డ్రైయిన్ల పూడికతీత పనులు చేపడుతుంటారు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు. వర్షాకాలం ప్రారంభం అవుతున్నా ఇంత వరకు పనులు పూర్తి కాలేదు.

డ్రైయిన్ పనులు ఇలా...

గుంటూరు నగరంలో 210 కిలోమీటర్ల మేర డ్రైయిన్లు విస్తరించి ఉన్నాయి. వీటిలో మేజర్ డ్రైయిన్లు 125.28 కిలోమీటర్లు, మీడియం డ్రైయిన్లు 67.41, మైనర్ డ్రైయిన్లు 16.25 కిలో మీటర్లుగా ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభమయ్యే నాటికి నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన డ్రైయిన్లలో పూడిక తీయాల్సిన అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఇంకా సగానికిపైగా పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

నగరంలో ప్రధానమైన డ్రైన్లు ఇవే..

గుంటూరు నగరంలో పీకలవాగు, నందివెలుగురోడ్డులోని డ్రెయిన్, సుద్దపల్లిడొంక, పొన్నూరు రోడ్డులోని డ్రెయిన్, గొర్రెలబజారులోని డ్రెయిన్, అంబేడ్కర్ వాగులు ప్రధానమైన డ్రెయిన్. పీకలవాగు పశ్చిమ నియోజకవర్గంలోని పాటిబండ్ల సీతారామయ్య స్కూల్ నుంచి ప్రారంభమై నగరంలోని చిన్న చిన్న కాలువలను, మిగత పెద్ద డ్రైయిన్లను కలుపుకుంటూ బుడంపాడు వరకు ప్రవహిస్తోంది.

నత్తనడకన పనులు

నగరంలో పూడికతీత పనుల కోసం నగరపాలక సంస్థ 76 వర్క్‌లకు గాను రూ.4.78 కోట్లు కేటాయించింది. నగరంలో ఎక్కడ కూడా ముంపునకు గురి కాకుండా ప్రతి ఏడాది పూడిక తీత పనులు జరుగుతుంటాయి. అయితే ఈ ఏడాది కూడా పనులు ప్రారంభించినా ఆశించిన స్థాయిలో పూర్తి కాలేదు. 76 వర్క్‌లకు గాను 15 వర్క్‌లు మాత్రమే పూర్తి స్థాయిలో పూడి తీసినట్లు ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. మిగిలినవి ఈ నెలాఖరు పూర్తి చేస్తామంటున్నారు. పైపైన సిల్ట్ తీయడం బిల్లు పెట్టుకుని కొట్టు దండుకోవడం నగరపాలక సంస్థలో పరిపాటిగా మారిందని చెప్పుకోవచ్చు.

రోడ్ల మీదే రోజుల తరబడి సిల్ట్..

డ్రెయిన్లలో తీసిన వ్యర్థాలను కాంట్రాక్టర్ ఎప్పటికప్పుడు తొలగించాలని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ చెత్తను సకాలంలో తరలించడం లేదు. మళ్లీ వర్షాలు కురిస్తే బయటకు తీసిన చెత్త డ్రైయిన్లోకి వెళ్లడం పరిపాటిగా మారిందని చెప్పుకోవచ్చు. మరి కొన్ని ప్రాంతాల్లో చెత్తను మున్సిపల్ సిబ్బందే తొలగించాలని కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరుస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఈ నెలాఖరుకు పనులు పూర్తి

నగరపాలక సంస్థ పరిధిలో లోతట్టు ప్రాంతాలు వర్షాకాలంలో ఎక్కడ కూడా ముంపునకు గురికాకుండా మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ అమలు చేసి డ్రైయిన్లను పూర్తి స్థాయిలో పూడిక తీయించి శుభ్రం చేయిస్తున్నాం. ఈ నెలాఖరుకు పూడికతీత పనులు పూర్తవుతాయి.
– నాగమల్లేశ్వరరావు, ఎస్ఈ, నగరపాలక సంస్థ

అనధికార వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగర పాలక సంస్థ పరిధిలోని శానిటరీ డివిజన్ వారీగా ప్రజారోగ్య కార్మికుల దగ్గర అనధికారిక నగదు వసూళ్లు జరుగకూడదని, చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో పారిశుద్ధ్య నిర్వహణపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని బిన్ ఫ్రీ సిటీగా చేయడానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కృషి చేయాలన్నారు. రానున్న 15 రోజుల్లో నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపడకపోతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు సోమవారం నుంచి ప్రత్యేక బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తాయని పేర్కొన్నారు. నగరంలో రోడ్ల మార్జిన్లు, డ్రైయిన్లు ఆక్రమణలకు గురికాకుండా ఉండాలంటే పట్టణ ప్రణాళిక, పబ్లిక్ హెల్త్ అధికారులు, సిబ్బంది కో ఆర్డినేషన్‌తో పని చేయాలని కోరారు. కార్మికుల దగ్గర అనధికారికంగా నగదు తీసుకొని హాజరు వేస్తున్నారని అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, ఈ విధంగా అందిన ఫిర్యాదులను పరిశీలించి, ఆధారాలతో వారిపై తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో రోడ్లపై ప్రజలు చెత్త వేయకుండా అవగాహన కలిగించాలని, పదే పదే చెత్త వేస్తున్న సదరు ప్రాంతాలలో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. నగరంలో పారిశుద్ధ్య మెరుగుదలకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అవసరమైన మ్యాన్ పవర్, చెత్త తరలింపు ట్రాక్టర్లను అందజేస్తామని వివరించారు. సమావేశంలో సీఎంహెచ్ఓ డాక్టర్ అమృతం పాల్గొన్నారు.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పథకాలపై అవగాహన


విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న శ్రీనివాసరావు, శంకరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా అమలవుతున్న పథకాలు, లోన్లు, సబ్సిడీ బ్యాంక్ అకౌంట్స్ అమలు తీరుపై గిరిజన, గ్రామీణ విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని ఆర్బీఐ ప్రాంతీయ రీసోర్స్ పర్సన్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ అండ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సోషల్ సర్వీస్ సొసైటీ(ఏఆర్‌టీడీఎస్), సమిక్షత గ్రామీణ గిరిజనాభివృద్ధి సేవా సంస్థ(ఆర్డీస్) సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడిపేట 6/14లోని శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ నర్సింగ్ సమావేశ మందిరంలో గ్రామీణ, గిరిజన విద్యార్థులు, యువతకు 'డిపాజిటర్స్ ఎడ్యుకేషన్' పై శనివారం జిల్లాస్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. మరొక రీసోర్స్ పర్సన్ ఆర్ఎస్ శంకర్రావు మాట్లాడుతూ ఇన్సూరెన్స్ పథకాలు, పొదుపు ఖాతాలు, బ్యాంక్ అకౌంట్స్ నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అవగాహన సదస్సుకు అధ్యక్షత వహించిన కార్యదర్శి వై.సాంబశివరావు మాట్లాడుతూ ఏ బ్యాంకులో అకౌంట్ ఉన్న సరే వారికి తప్పనిసరిగా జీవనజ్యోతి, అటల్ పెన్షన్ యోజన, సురక్ష బీమా వంటి పథకాలు పొందవచ్చునని చెప్పారు. గిరిజన, గ్రామీణ ప్రాంతాలలో సేవా స్వచ్ఛంద కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పథకాలను ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్‌టీడీఎస్ అధ్యక్షురాలు పి.విజయలక్ష్మి, కోఆర్డినేటర్ షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

వైభవంగా తాళ్లపాక అన్నమాచార్య జయంత్యుత్సవం


బ్రహ్మశ్రీ మల్లాది సూరిబాబుకు సత్కారం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. గాయత్రీ మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపనిషత్తుల వైద్యనిపుణులు డాక్టర్ శ్రీకాంత్ రఘు, మైథిలి దంపతులు, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఈతుకూరి నాగేశ్వరరావు, భూసురపల్లి వెంకటేశ్వర్లు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత మల్లాది సూరిబాబును సత్కరించారు. మల్లాది సోదరులు శ్రీరామప్రసాద్, రవికుమార్ (విజయవాడ) శాస్త్రీయ సంగీత గాత్ర యుగళ కచేరీ అలరించింది. సంగీత త్రిమూర్తుల కీర్తనలు, అన్నమయ్య కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. కార్యక్రమంలో మండలి అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి ఎడ్లై శేషరాణి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాదచెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, కార్యదర్శి ఏవీ మంగాదేవి, కోశాధికారి విజయలక్ష్మి సత్కరించారు.

నర్సింగ్ కళాశాలకు బస్సు వితరణ

- తులసి సీడ్స్ సంస్థ ఆర్థిక సాయం
- హాజరైన కేంద్ర మంత్రి పెమ్మసాని


తులసి రామచంద్రప్రభును సన్మానిస్తున్న మంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు మెడికల్: ఇది కేవలం ఒక బస్సు అందజేత కాదు... 13 ఏళ్లగా ఎదురుచూస్తున్న నర్సింగ్ విద్యార్థుల ఆశ అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. నర్సింగ్ విద్యార్థుల కోసం రూ.33 లక్షల విలువైన బస్సును తులసి సీడ్స్ సంస్థ అధినేత తులసి రామ చంద్ర ప్రభు విరాళం చేశారు. బస్సును మంత్రి, ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్‌తో కలిసి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం నర్సింగ్ కాలేజీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సేవాభావానికి నిదర్శనంగా నిలిచే ఈ దాతృత్వం ఎంతో మందికి మార్గదర్శకంగా మారుతుందన్నారు. గుంటూరు నర్సింగ్ హాస్టల్, మెడికల్ కాలేజ్ మధ్య నిత్య ప్రయాణం కోసం నర్సింగ్ విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన 55 సీట్ల బస్సును తులసి రామచంద్ర ప్రభు, వారి తనయుడు యోగేష్ తమ వ్యక్తిగత నిధులతో అందించడాన్ని ఆయన హృదయపూర్వకంగా అభినందించారు. కార్యక్రమానికి హాజరైన తులసి రామచంద్ర ప్రభు, యోగేష్, జీఎంసీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులంతా దీనికి పునాది వేశారని, అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు.

17న పాలస్తీనా సంఘీభావ దినం


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, పక్కన సీపీఎం నగరకార్యదర్శి నళినీ కాంత్

లక్ష్మీపురం: పాలస్తీనా సంఘీభావ దినాన్ని ఈనెల 17న తేదీ నిర్వహించనున్నట్లు వామపక్షాల నాయకులు తెలిపారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ మల్లయ్య లింగం భవన్‌లో సంయుక్తంగా శనివారం సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ, ఎంసీపీఐ(యూ) పార్టీల సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు ఎస్.చిన్న, రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి మన్నవ హరిప్రసాద్, ఎంసీపీఐ(యూ) నేత వెంకటేశ్వరరావు మాట్లాడారు. "గాజాపై దాడుల్లో ఇప్పటివరకు 55,000 మందికిపైగా పాలస్తీనియుల ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థుల ఆశ్రయాలపై దాడి చేయడం మానవత్వానికి వ్యతిరేకం అని ఇది ఒక రకంగా జాతి నిర్మూలనలే అని చెప్పారు. ఇజ్రాయెల్ "ఫ్రీడమ్ ఫ్లోటిల్లా" అనే మానవతా సహాయక నౌకపై అంతర్జాతీయ జలాల్లో దాడి చేసిన ఘటనను కూడా వారు తీవ్రంగా ఖండించారు. వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని, గాజాకు మానవతా సహాయం నిర్బంధం లేకుండా అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం పాలస్తీనాపై తన చారిత్రాత్మక మద్దతును మరిచి, ఇజ్రాయెల్ ఆక్రమ చర్యలపై నిశ్శబ్దంగా ఉండడం నిరాశ కలిగిస్తోందన్నారు. ఇజ్రాయెల్‌తో ఉన్న సైనిక-భద్రతా ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

రక్తదానంపై సమాజాన్ని చైతన్యపర్చాలి


విద్యార్థులను అభినందిస్తున్న రామకృష్ణప్రభు, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: రక్తదానంపై సమాజాన్ని చైతన్యపర్చాలని బాపూజీ కమిటీ కార్యదర్శి కర్నాటి రామకృష్ణప్రభు పేర్కొన్నారు. శనివారం నగరంపాలెంలోని గుంటూరు చలమయ్య–కర్నూటిపాపమ్మ వెంకటనారాయణ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదానం చేసిన బీఎస్సీ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు రక్తదాన దినోత్సవం సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రామకృష్ణప్రభు మాట్లాడుతూ చిన్న వయసులోనే రక్తదానం చేయడం అనే గొప్ప మనసు కలిగి ఉండటం సంతోషించదగినదని అన్నారు. రక్తదానంపై విద్యార్థులకు అవగాహన కలిగించేలా రక్తదాన విలువలను గుర్తు పాఠ్యాంశంగా చేర్చాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ షేక్ తౌఫిక్ అనే విద్యార్థి తాను రక్తదానం చేయడమే కాక అదే సమయంలో తన స్నేహితుడికి రక్తదాన విలువను తెలియజేసి, ప్రాణాంతక పరిస్థితుల్లో ఉన్న బాధితునికి రక్తదానం చేయించడాన్ని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థుల షేక్ తౌఫిక్, బి.భాస్కర్, వి.ప్రవీణ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు ఎ.శ్రీధర్, వై.దంపెల్‌ర్, అధ్యాపకులు ఇందిరాజ్యోతి, భవాని దుర్గ పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్లు అందజేత



మంగళగిరి టౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, రోటరీ క్లబ్ ఆఫ్ బాంబే హిల్స్ ఆధ్వర్యంలో శ్రీసాధు పేరుతో దివ్యాంగులకు ప్రభ ఫుట్ కృత్రిమ కాళ్ల పంపిణీ కార్యక్రమం మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ కళాశాలలో శనివారం నిర్వహించారు. రెండవ రోజు జరిగిన ఈ శిబిరంలో 35 మంది దివ్యాంగులకు ప్రభ ఫుట్ కృత్రిమ కాళ్లను అమర్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు వారు కోల్పోయిన కాలి కొలతల ఆధారంగా కృత్రిమ కాళ్లను రూపొందించి అమర్చడమే కాకుండా ఎలా నడవాలో తర్ఫీదు ఇచ్చారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ సాధారణ కృత్రిమ కాళ్ల కంటే ప్రభ ఫుట్ కాళ్లు ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు గాజుల శ్రీనివాసరావు, మండలి మోహనరావు, ప్రాజెక్ట్ చైర్మన్ అనిల్ చక్రవర్తి, క్లబ్ డైరెక్టర్లు పోలేపల్లి నిరంజన్ గుప్త, శ్రీనివాసరావు, ప్రగఢ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు కృషి చేయాలి

దుగ్గిరాల: కేవలం ఆర్డినెన్స్‌తో సరిపెట్టకుండా చట్టం చేసి, వర్గీకరణకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మార్పీఎస్ ఏపీ స్టేట్ లీగల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ పేర్కొన్నారు. చిలువూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుతో కుమ్మక్కైన మంద కృష్ణ మాదిగ జాతికి తీవ్ర ద్రోహం చేస్తున్నారని దుయ్యబట్టారు. సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పుకు విరుద్ధంగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఆర్డినెన్సు రోస్టర్ విధానం తెచ్చి, బాగా అభివృద్ధి చెందిన మాల సామాజిక వర్గానికి అదనపు లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తూ, మంద కృష్ణ మాదిగ మాదిగలను చంద్రబాబుకు తాకట్టు పెడుతున్నారని అన్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

మంగళగిరి టౌన్: ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు మహిళలకు గాయాలైన ఘటన శనివారం మంగళగిరి పట్టణంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాలు... ఎంటీఎంసీలో పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న ఇద్దరు మహిళలు తెనాలి ఫ్లైఓవర్ పక్కనే ఉన్న పిచ్చిమొక్కలను శుభ్రం చేసే క్రమంలో అటుగా వస్తున్న ఓ బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఘటనలో ఒక మహిళకు కాలు విరగడంతో పాటు తలకు బలమైన గాయమైంది. మరో మహిళకు స్వల్ప గాయాలు కావడంతో ఇద్దరు మహిళలను నగర పరిధిలోని ఎయిమ్స్ ఆస్పత్రికి స్థానికులు తరలించారు. ద్విచక్రవాహనంతో ఢీకొట్టిన యువకుడికి కూడా స్వల్ప గాయాలు కావడంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమ వసూళ్లను అరికట్టాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పుస్తకాలు, యూనిఫాం పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కార్పొరేట్ విద్యాసంస్థలు పాల్పడుతున్న అక్రమ వసూళ్లను అరికట్టాలని ఏబీవీపీ గుంటూరు జిల్లా కన్వీనర్ వంశీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో సీవీ రేణుక ఛాంబర్ బయట తలుపుకు వినతి పత్రాన్ని అతికించారు. వంశీకృష్ణ మాట్లాడుతూ వేలాది రూపాయల ఫీజులతో విద్యార్థులను దోచుకుంటున్న కార్పొరేట్ విద్యాసంస్థలు పుస్తకాలు, యూనిఫాంను క్యాంపస్‌లలోనే విక్రయిస్తూ విద్యా వ్యాపారం సాగిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి నాగసాయి, కిషోర్ పాల్గొన్నారు.

ఏపీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

మంగళగిరి టౌన్: మంత్రి లోకేష్ చొరవ తీసుకుని, ఏపీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ పేర్కొన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏపీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు శనివారంతో 193వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కార్మికులకు మద్దతు తెలియజేసి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నారా లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని హామీఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయుడు చేగువేరా

తెనాలిటౌన్: స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో చేగువేరా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు పాల్గొని చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ పాషా వెంకటేష్ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక సింహస్వప్నం, పోరాటాల స్ఫూర్తి ప్రదాత చేగువేరా జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జూన్ 14వ తేదీ చేగువేరా జయంతిగా తెలిపారు. వైద్య విద్యనభ్యసించి మోటార్ సైకిల్‌పై ప్రపంచ యాత్రచేశారని గుర్తు చేశారు. పేదరికాన్ని నిర్మూలించాలనే ఆలోచనతో అనేక పోరాటాలు చేసినట్లు వెల్లడించారు. నేటి యువత విద్యార్థులు చేగువేరా భావజాలాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గద్దె శివ, ఎం.కిరణ్‌బాబు, కె.రవితేజ పాల్గొన్నారు.

ప్రజలపై అదనపు విద్యుత్ భారం

సీపీఎం పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్

తెనాలిటౌన్: కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారం చేపట్టి ప్రజలపై మోయలేని భారాలను మోపుతుందని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ ఆరోపించారు. శనివారం స్థానిక చెంచుపేటలోని మార్కెట్ యార్డు, సివిల్ సప్లయిస్ గోడౌను ప్రాంతాల్లో పర్యటించిన కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో ప్రజలపై మోపిన వస్తువుల భారం వివరించారు. రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. విద్యుత్ బిల్లుల భారాన్ని కార్మికులకు వివరించారు. ఇంటి పన్నుల పేరుతో విధిస్తున్న అదనపు భారాన్ని తెలియజేశారు. కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ వేస్తూ పేదల జేబులు చిల్లుపెడుతున్నారని కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కార్యక్రమంలో జి.బాబూరావు, టి.వీరయ్య, జె.యోహాన్, నరసింహారావు, కమలకరరావు, శివయ్య, ఏలియా, సుశీలరావు, వీరాంజనేయులు, సుధాకర్, బంగారుబాబు, పోతురాజు, రవికుమార్, తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

మేడికొండూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ సూచించారు. మండల పరిధిలోని పేరేచర్ల గ్రామంలో శనివారం గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శుభకార్యాలకు వెళ్లే వారు, ముఖ్యంగా మహిళలు బంగారు ఆభరణాల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులను తెరవకుండా ఓటీపీలను ఎవరికీ తెలియజేయకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. ప్రజలు ఎవరైనా సుదూర ప్రాంతాలకు వెళ్తే తప్పనిసరిగా పోలీసు వారికి సమాచారం ఇవ్వాలన్నారు.

మున్సిపల్ కార్మికులకు పథకాలు అమలు చేయాలి

మంగళగిరి టౌన్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు అన్ని ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య డిమాండ్ చేశారు. ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట శనివారం పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తల్లికి వందనం పథకం మున్సిపల్ కార్మికులకు రాకపోవడంతో ఆందోళనకు దిగారు.

క్లుప్తంగా

రేపు గాంధీ పార్కులో మెగా యోగా కార్యక్రమం

నెహ్రూనగర్: అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈ నెల 21వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025లో భాగంగా గాంధీ పార్క్‌లో మెగా యోగా కార్యక్రమం ఈనెల 16వ తేదీ నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా అవగాహన కలిగించడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, నగర మేయర్, ఎమ్మెల్సీలు, శాసనసభ్యులు, కార్పొరేటర్లు పాల్గొంటారన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: ఎస్‌వీఎన్‌కాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. స్వామిని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం వేళలో ఆలయ ద్వారక ప్రదక్షిణాలు, ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు వల్లేపాటి పూర్ణచంద్రరావు, కార్యదర్శి నల్లమోతు వెంకటరత్నయ్య, కోశాధికారి డాక్టర్ పుచ్చా వెంకటమల్లేశ్వర్ పాల్గొన్నారు.

కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేయాలి

లక్ష్మీపురం: తల్లికి వందనం పథకం ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులందరికీ వర్తింపజేయాలని సీపీఐ నగర కార్యదర్శి, మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. శనివారం 9వ శానిటరీ డివిజన్ లాలాపేట రోడ్ కార్యాలయం వద్ద కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సమ్మె కాలంలో మున్సిపల్ కార్మికులందరికీ ప్రభుత్వ పథకాలకు అర్హులను చేస్తామన్న అధికారులు నేడు దానిని మరిచారని అలాగే పారిశుధ్య కార్మికులను గొప్పగా చూసుకుంటామని చెబుతున్న ప్రభుత్వాలు మున్సిపల్ కార్మికులను చిన్నచూపు చూడడం సరైనది కాదన్నారు. వెంటనే ప్రభుత్వ పథకాలను మున్సిపల్ కార్మికులందరికీ లబ్ధిదారులుగా చేసి వారిని ఆదుకోవాలని అన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంపుదలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బిలిపోతుల వెంకట్రావు ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఈవెంకట్రావు కోశాధికారి కోటి వీరాంజనేయులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి



లక్ష్మీపురం: చేగువేరా విప్లవభావాల సంస్ఫూర్తి ప్రపంచ విప్లవకారులకు స్ఫూర్తి అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ అన్నారు. గుంటూరు కొత్తపేట సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రపంచ విప్లవకారుడు చేగువేరా జయంతి శనివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాసర్‌జీ మాట్లాడుతూ యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యశ్వంత్, నగర కార్యదర్శి ప్రణీత్, నగర నాయకులు అజయ్, సాయి గణేష్, వెంకట్, భాస్కర్, కోటి పాల్గొన్నారు.

మాటలకు అందని మహా విషాదం

లక్ష్మీపురం: గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలి అందులోని ప్రయాణికులు, సిబ్బంది, కూలిన ప్రాంతంలో ఉన్న వైద్య విద్యార్థులు దుర్మరణం చెందటం అత్యంత విషాదకరమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం ప్రమాద ఘటనపై సమావేశం నిర్వహించారు. ప్రమాదం నేపథ్యంలో ఎయిర్ ఇండియా తన విమానాల సంపూర్ణ ప్రక్షాళనకు సిద్ధపడక తప్పదని చెప్పారు.

దుకాణంలో చోరీ

మంగళగిరి టౌన్: నగర పరిధిలోని ఓ దుకాణంలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం మంగళగిరి పట్టణానికి చెందిన మాజేటి సుబ్బు సాయి పోలీస్ క్వార్టర్స్ పక్కనే సంగం డెయిరీ పాలు నడుపుకుంటున్నారు. శుక్రవారం రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున షాపు తీయడానికి వచ్చిన సాయి షట్టర్ తాళాలు పగలకొట్టి ఉండడం గమనించి, షాపులో లోపల అన్నీ చిందర వందరగా పడి ఉండడం గమనించారు. గల్లాపెట్టెలో వున్న రూ.6వేలు నగదు, సుమారు రూ.లక్ష విలువ చేసే రెండు సెల్‌ఫోన్లతో పాటు సిగరెట్ బండిల్స్ చోరీకి గురైనట్లు గుర్తించారు. జరిగిన ఘటనపై మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు.